క్లుప్తంగా

ఘనంగా జీ 20 వేడుకలు



జీ 20 సభ్య దేశాల పతాకాలతో విద్యార్థినులు, అధ్యాపకులు

దెందులూరు: బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో బుధవారం జీ 20 వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థులు జీ 20 సభ్య దేశాల జాతీయ పతాకాల పోస్టర్లతో ప్రదర్శన నిర్వహించారు. ఒకే కుటుంబం– ఒకే భూమి– ఒకే భవిష్యత్తుతో పాటు ప్రతి ఒక్కరూ ఆదరణ, ప్రేమ, సేవాభావంతో జీవించాలని జీ 20 సమావేశం నినాదంపై కరస్పాండెంట్ నూకరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పంచ లోహ విగ్రహాల అందజేత

ఉంగుటూరు: కై కరం గీతామృత వాహిని సత్సంగం, శ్రీసీతారామ గీతార్చన భజన మండలి సభ్యులు పూళ్ల భూసా భాస్కరరావు ఆధ్వర్యంలో నూతనంగా వెంకటేశ్వర గానామృతం రూప కల్పన నేర్చుకున్నారు. దీనికి సంబంధించి అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి పంచలోహ విగ్రహాలు, వాటికి కావల్సిన అలంకార వస్తువులు గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు కోనా శ్రీనివాసరావు, కోనా హనుమలు సత్సంగం సభ్యులకు అందజేశారు.

నాడు-నేడుపై సమీక్ష



దెందులూరు ఎంఆర్‌సీ కార్యాలయంలో నాడు-నేడుపై సమీక్షిస్తున్న దృశ్యం

దెందులూరు: ప్రభుత్వ ఆదేశాలు, ప్రాధాన్యత, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి, నాడు–నేడు మన బడి పనులు సకాలంలో పూర్తి చేయాలని దెందులూరు మండల విద్యాశాఖాధికారులు అన్నమ్మ, ప్రసాద్ అన్నారు. బుధవారం దెందులూరు ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాశాఖాధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో నిరంతర పర్యవేక్షణ చేస్తూ నిర్మాణాలు పనులు పూర్తి చేయించాలన్నారు. అనంతరం సెకండ్ ఫేజ్‌లో నిర్మాణాలపై గ్రామాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

పెదపాడు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. బుధవారం పెదపాడు మండలంలోని వట్లూరులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పొలం పరిసరాలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. శత్రు పురుగుల సంఖ్య మిత్ర పురుగుల సంఖ్యను వివరిస్తూ పురుగు మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వైద్యం

గణపవరం: ఫ్యామిలీ ఫిజీషియన్, వైఎస్సార్ కంటి వెలుగు, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని పీహెచ్‌సీ సీహెచ్‌వో జె.విల్సన్ అన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం గణపవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అర్ధవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 21 మందికి కళ్లజోళ్లు పడినట్లు ఆప్తాలమిక్ అసిస్టెంట్ శ్రీనివాస్ తెలిపారు. వీరందరికీ వారం రోజుల్లో కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. హెచ్‌ఎం ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

పెదపాడు: ట్యాంకర్, మోటార్ సైక్లిస్టు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడు ఘటనాస్థలంలోనే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పెదపాడు మండలంలోని సకల కొత్తపల్లి గ్రామ సమీపంలో బుధవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దుగ్గిరాలకు చెందిన చవలమూడి మహేష్, అతని స్నేహితుడు రాఘవులు, అదే గ్రామానికి చెందిన నాని కుమారుడు సిద్దు (5)తో కలిసి మోటార్ సైకిల్‌పై గుడివాడ నుంచి దుగ్గిరాల వెళుతున్నారు. వారు సకల కొత్తపల్లి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్యాంకరును ఢీ కొట్టడంతో సిద్ధూ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈప్రమాదంలో మహేష్, రాఘవకు గాయాలయ్యాయి. పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

గ్రామాల్లో కొత్త పింఛన్ల పండుగ

- ఆనందోత్సాహాల్లో లబ్ధిదారులు
- అర్హులందరికీ నూతన పింఛన్ల మంజూరు
- ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి (ఫైల్)

దెందులూరు: అర్హులందరికీ నూతన పింఛన్లు మంజూరయ్యాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంజూరైన 8,006 పింఛన్లతో కలిపి మొత్తం నియోజకవర్గంలో పింఛన్లు 39,243 మంది అందుకుంటున్నారని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్త పెన్షన్లు ఇవ్వడంలేదని టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం దారుణమని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 8,006 మందికి నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని ఆయన వివరించారు. టీడీపీ హయాంలో ఐదేళ్లల్లో దెందులూరు నియోజకవర్గంలో పింఛన్లు అందుకున్నవారి సంఖ్య 31,237మంది మాత్రమేనన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం దిగిపోయే ముందు వరకు ఇచ్చిన పింఛన్ నగదు కేవలం రూ. వెయ్యి మాత్ర మే అన్నారు. సీఎం జగనన్న పింఛన్ నగదు రూ. 2,750 లబ్ధిదారుడికి అందిస్తున్నారని అన్నారు. పథకాల మంజూరుకు లంచాలు, వివక్షకు తావులేదని, దళారీలకు, బ్రోకర్లకు చోటులేదని అన్నారు. జగనన్నప్రభుత్వంలో కులం, మతం, వర్గం, రాజకీయ బేధం లేకుండా అర్హులైన వారందరికీ పెన్షన్లు అందుతున్నాయన్నారు.



శ్రీరామవరంలో కొత్త పింఛను నగదు అందజేస్తున్న కామిరెడ్డి నాని తదితరులు

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి అయిన వలంటీర్లు ప్రతి నెల 1వ తేదీన ఉదయం సూర్యుడు రాక ముందే లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పింఛను అందించేలా జగనన్న ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు.

సచివాలయాల్లో పండుగ వాతావరణం

అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛను మంజూరు చేసిందని ఆపార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. బుధవారం మండలంలో గ్రామ గ్రామాన కొత్త పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమం సచివాలయాల్లో పండుగ వాతావరణంలో నిర్వహించారు. శ్రీరామవరంలో కామిరెడ్డి నాని నూతనంగా మంజూరైన 15 పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కామిరెడ్డి బాలు, మామిడి రాము, పొన్నూరి చిన్నారావు, కొత్తపల్లి రవీంద్ర, గ్రామ కార్యదర్శి దాసు, వెల్ఫేర్ అసిస్టెంట్ రజనీ ఉన్నారు.

జోగన్నపాలెం: వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీ, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన 7 పింఛన్ల నగదును గాంధీ, వాసు కలిసి లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులున్నారు.

గాలాయగూడెం: సర్పంచ్ చిలకావెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన 40 మందికి పింఛన్ నగదును సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, పంచాయతీ వార్డు మెంబర్లు శ్రీధర్, రాజేష్, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు అందజేశారు.

సీతంపేట: గ్రామంలో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ నగదును సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. లబ్ధిదారులందరూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ఎంపీటీసీ పులపర్తి వరమణి, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి పులవర్తి సంతోష్, నాయకులు వర్రే సత్తిబాబు, ఉదయ్, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

లింగాకర్షక బుట్టలతో పంటలకు మేలు



భోగాపురం వద్ద రైతులకు లింగాకర్షక బుట్టలు అందజేస్తున్న వ్యవసాయశాఖాధికారులు

పెదవేగి : ప్రకృతి వ్యవసాయంలో కాండం తొలుచు పురుగులను రెక్కల పురుగులను నివారించడంలో లింగాకర్షణ బుట్టలు ఎంతగానో ఉపకరిస్తాయని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు ఎస్‌డీఏ సరోజిని తెలిపారు. బుధవారం పెదవేగి మండలం భోగాపురంలో సామూహికంగా రైతులతో మాట్లాడి లింగాకర్షణ బుట్టలు, ఎల్లో ప్లేట్స్ పొలాల్లో ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగాకర్షణ బుట్టల్లోని ఎర మగ రెక్కల పురుగులను, కాండం తొలుచు పురుగులను నివారిస్తుందని చెప్పారు. దీని వల్ల సంయోగ క్రియ ఆగిపోయి పురుగుల శాతం తగ్గిపోతుందని చెప్పారు. ఎల్లో ప్లేట్ల వల్ల దానికి అంటుకున్న దోమలు, పురుగులను గమనించి తగు జాగ్రత్తలను తీసుకోవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం 52వ యూనిట్ ఇన్‌చార్జ్ సరోజిని, ఐసీఆర్‌పీ సత్తిబాబు, రంగారావు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా విద్యార్థుల క్రీడాపోటీలు



కొప్పాక ఉన్నత పాఠశాల్లో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం శైలజ



బాలురతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఎంఈఓ

- ముగిసిన మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు
- కొప్పాక ఉన్నత పాఠశాలలో సందడి

పెదవేగి : మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. రెండు రోజులుగా మండల స్థాయిలో నిర్వహిస్తున్న అండర్ 14, 17 ఆటల పోటీల ఎంపికలు కోలాహలంగా ముగిసాయి. బుధవారం పెదవేగి మండలం కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఎస్‌జీఎఫ్ మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 15 ఉన్నత పాఠశాలల నుంచి 350 విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారి సీహెచ్ బుద్దవాస్ పాల్గొని మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు, తరువాత నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ శైలజ అధ్యక్షత వహించారు. అనంతరం ఎంఈఓ, హెచ్‌ఎంలు విద్యార్థులతో కలిసి కాసేపు పలు రకాల ఆటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ పెదవేగి మండల ఇన్‌చార్జ్ ఎం శ్రీనివాసరావు, పీడీలు కె జయరాజు, ఎం మల్లికార్జునరావు, సఫీ, పీఈటీ పి గురుమూర్తి, వివిధ పాఠశాల నుంచి వచ్చిన పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలస్థాయి స్కూల్ గేమ్స్

దెందులూరు: దెందులూరు మండల స్థాయి స్కూల్ గేమ్స్ గురువారం ప్రారంభమవుతాయని ఫెడరేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం.కృష్ణారావు, దెందులూరు మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్ కుమార్ అన్నారు. బుధవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ దెందులూరు మండల శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్, త్రోబాల్, యోగా ఆటల్లో ఎంపిక జరుగుతుందన్నారు. బాలురు బాలికల అండర్–14,17 విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. గురు, శుక్ర వారాల్లో కొవ్వలి ఉన్నత పాఠశాలలో ఎంపిక కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్ కుమార్ అన్నారు.



ఉంగుటూరు : కైకరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు

క్రీడాస్ఫూర్తి చాటాలి

ఉంగుటూరు: విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని కైకరం హైస్కూలు హెచ్‌ఎం ప్రసాదరావు అన్నారు. బుధవారం కైకరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి ఆటలు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ జయాపజయాలను సమానంగా చూడాలని అన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాల్లో రిజర్వేషన్ పొందవచ్చని అన్నారు. పోటీల ప్రారంభోత్సవంలో ఒలింపిక్ అసోషియన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి సత్యనారాయణ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. 200 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. వాలీబాల్, కబడ్డీ, డిస్కస్ త్రో, జావలిన్ త్రో, త్రో బాల్ షాట్‌పుట్, బాలురు, బాలికలు విభాగంలో అండర్ 14, అండర్ 17, కేటగిరిల్లో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో మండల కోఆర్డినేటర్ ఎంబీఎల్ నారాయణ, మండలంలోని వివిధ పాఠశాలల పీడీలు విద్యార్థులు పాల్గొన్నారు.



ఉంగుటూరు : ఖో-ఖో పోటీలో విద్యార్థులు

మండల స్థాయిలో పోటీల్లో పాల్గొన్న బాలబాలికలు

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండలస్థాయి ఆటల పోటీలు బుధవారంతో ముగిసాయి. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో వివిధ నిర్వహించిన క్రీడాపోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీల్లోని 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల చైర్మన్, హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. మండల కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల పీడీల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పరుగు పందెం, అథ్లెటిక్స్, ఖోఖో, టెన్నీకాయిట్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో పీడీలు డి.శంకర్, ఎం.ప్రసాద్, పి.కృష్ణారావు, టి.రాహుల్, కె.ప్రమీలారాణి పాల్గొన్నారు.

నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులకు అధిక ధర

గణపవరం: రైతులు నాణ్యమైన ఉత్పత్తులు సాధించడం ద్వారా మద్దతు ధర కన్నా ఎక్కువ ధరను పొందవచ్చునని, రైతులు ఆ దిశగా కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరావు, ఏడీయే పి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం గణపవరం మండలం అప్పనపేటలో మండల ఏవో యర్రంశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా ధాన్యం ఎగుమతి చేయడానికి అనుగుణంగా వరి ఉత్పత్తి చేయాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం అంటే మేలైన ఆధునిక పద్ధతుల ద్వారా, రసాయనాల వాడకం తగ్గించి, నాణ్యమైన వరిని పండించడమేనన్నారు. రైతులంతా సంఘటితంగా ఒక రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు రైతులందరికీ అందుతాయన్నారు. అనంతరం రైతులకు మిత్ర, శత్రు పురుగులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులంతా ఈకేవైసీ త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పశువైద్యాధికారి జ్యోతి, రైతులు పాల్గొన్నారు.



పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

ఎన్‌సీసీ శిక్షణతో ఉన్నత భవిష్యత్తు



భీమడోలులో ఎన్‌సీసీ శిక్షణకు ఎంపికైన యువతీ యువకులతో ప్రిన్సిపల్స్, ఆంధ్రా బెటాలియన్ సిబ్బంది

భీమడోలు: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రవేశాల్లో జాతీయ కేడిట్ కోర్ (ఎన్‌సీసీ) ఎంతగానో దోహద పడుతుందని కళాశాల ప్రిన్సిపల్స్ వి.నాగేశ్వరరావు, బొమ్ము రవికుమార్ అన్నారు. భీమడోలులోని వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల్లోని యువతీ యువకులు ఎన్‌సీసీ శిక్షణలో చేరేందుకు ఉత్సాహాన్ని చూపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న యువతీ యువకులకు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలూరులోని 19 ఆంధ్ర బెటాలియన్ సిబ్బంది బుధవారం వారికి పలు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. 50 మంది యువతీ యువకుల్లో వడపోత పోసి వారిలో 20 మందిని ఎంపిక చేసారు. సిబ్బంది వారికి పలు రకాల పరీక్షలు నిర్వహించారు. వారి ఎత్తు, ఛాతిలతో పాటు వారి ఫిట్‌నెస్ పరీక్షలు చేసారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్స్ వి.నాగేశ్వరరావు, బొమ్ము రవికుమార్ మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఉండడంతో సుదూర ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు సైతం చేరుతున్నారన్నారు. దీనితో కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. చదువుతో పాటు ఎన్‌సీసీ శిక్షణ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేస్తే ఉన్నత భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కె.శివశంకర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

భీమడోలు: వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడుల సాధిస్తారని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. భీమడోలులో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం సంబంధిత వ్యవసాయ సిబ్బందితో కలిసి శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఫణికుమార్, శాస్త్రవేత్త నాగేంద్ర, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుజాతలు రైతులకు సార్వాలో తీసుకోవాల్సిన మెలకువలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మేలైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు తగు సూచనలను అందించారు. పరిసరాల పర్యావరణ విశ్లేషణ్‌లో భాగంగా వరి చేలను పరిశీలించారు. ఆకుముడత తెగులు నివారణకు ఎకరానికి 8 కేజీల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ వేసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తారన్నారు.



భీమడోలులో రైతులతో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త ఫణికుమార్, కోఆర్డినేటర్ సుజాత

వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మెలకువలతో కూడిన సాగు చేయాలన్నారు, రైతులు అనవసర ఖర్చులు తగ్గించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. రైతులంతా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సూచనలను విధిగా పాటించాలన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. భీమడోలు ఏవో ఉషారాణి, వీఏఏ, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెదవేగి : పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూపర్‌వైజర్ శాంతారత్నం అన్నారు. పెదవేగి మండలం అమ్మపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షతన పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెదపాడు వారి సహకారంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తయారు చేసుకునే విధానాలను వాటి వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులకు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కె. శాంతరత్నం పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐదు రకాల వంటకాలను తయారు చేసి, మునగాకు చపాతి, శనగల సలాడ్, రాగి లడ్డూ, అటుకుల పులిహోర, జొన్న పిండి రొట్టెలు తయారు చేసి తినడం వల్ల రక్తహీనతను నివారించవచ్చని అన్నారు. మెడికల్ ప్రైమరీ హెల్త్ ఆఫీసర్ ఎం కృష్ణవేణి మాట్లాడుతూ గర్భిణులు బాలింతలు ఐరన్ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను, ఆకుకూరలను తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవరపల్లి ఏసు మరియమ్మ, జిల్లా కోఆర్డినేటర్ ఎస్ రవిబాబు, అంగన్‌వాడి సిబ్బంది ఎం రంగమ్మ, ఎస్ సుజన, ఆశా వర్కర్స్ ఎంఎంఎల్‌హెచ్‌పీ కే సౌజన్య పాల్గొన్నారు.



అమ్మపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శాంతారత్నం

ఈ-క్రాప్ నమోదు

దెందులూరు: మండలంలో 20 గ్రామ సచివాలయాల పరిధిలో 7 వేల ఎకరాల్లో పంటల ఈ–క్రాప్ నమోదు పూర్తి చేసినట్టు దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దెందులూరు మండలంలో 15 వేల ఎకరాల్లో పంటల ఈ–క్రాప్ నమోదు చేయాల్సి ఉందని, అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది చురుగ్గా ఈ–క్రాప్ నమోదు చేస్తున్నారని ఈ నెలాఖారు లోపు 2 వేల ఎకరాల నమోదు కార్యక్రమం పూర్తి చేస్తామని వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది నమోదుకు వచ్చినప్పుడు భూయజమానులైన రైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు.


ఆయుష్మాన్‌భవ పథకంపై అవగాహన ర్యాలీ

భీమడోలు: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ఆయుష్మాన్‌భవ లక్ష్యమని పూళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.లీలాప్రసాద్ అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో బుధవారం పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని వెల్‌నెస్ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి.లీలాప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లోని ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి మెరుగైన వైద్యసేవలందించడమే ఆయుష్మాన్‌భవ లక్ష్యమన్నారు. ప్రతి పౌరునికి డిజిటల్ హెల్త్ ఐడీని అందిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య సిబ్బందిని కలిసి వాటిని పొందాలన్నారు. సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆరు వేల వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను అందిస్తుందన్నారు. ఈ పథకం నిరుపేద కుటుంబాలకు వరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కిషోర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ పాల్గొన్న వైద్యాధికారి బి.లీలాప్రసాద్, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్

పోలింగ్ కేంద్రాలను మార్పు చేయాలి



ఆర్డీవో ఎస్‌కే ఖాదర్‌వల్లి

ఉంగుటూరు: తోటరామచంద్రపురం, తిమ్మయ్యపాలెం, కొత్తగూడెంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాజకీయ నాయకులు కోరారు. బుధవారం ఉంగుటూరు తహసీల్దారు కార్యా లయంలో ఆర్డీవో ఎస్‌కే ఖాదర్‌వల్లి అధ్యక్షతన రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి మాట్లాడుతూ తిమ్మయ్యపాలెం శివారు కొత్తగూడెం ప్రజలు ఓటు వేసేందుకు గొల్లగూడెం వెళుతున్నారని, కొత్తగూడెంలో పోలింగు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. లంకమాలపల్లి, వెంకటకృష్ణాపురం ప్రజలకు వెంకటకృష్ణాపురంలో పోలింగు కేంద్రం ఏర్పాటు చేయాలని బాబ్జి కోరారు. తోటరామచంద్రపురం, రామాపురం ఓటర్లు ఓటు వేయడానికి కాకర్లమూడి వెళ్లలేకపోతున్నందున తోటరామచంద్రపురంలో పోలింగు కేంద్రం ఏర్పాటు చేయాలని వైసీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు కోరారు. భీమడోలు మండలం చిన్న లింగపల్లి ఓటర్లు పెదలింగపల్లి వెళ్లలేకపోతున్నందున చినలింగంపల్లిలో పోలింగు కేంద్రం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. గునపర్రు పోలింగు కేంద్రానికి శీతారామపురం ప్రజలు ఓటింగుకు వెళ్లలేకపోతున్నందున శీతారామపురంలో పోలింగు కేంద్రం ఏర్పాటు చేయాలని నిడమర్రు జెడ్పీటీసీ కోరారు. ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైసీపీ నాయకుడు కొరిపల్లి శ్రీను, సీపీఎం నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, బీజేపీ నాయకులు దుర్గారావు, కాంగ్రెస్, టీడీపీ నాయకులు, తహసీల్దార్లు వెంకటరమణ, ఇందిరాగాంధీ, సాయిరాజు, లక్ష్మిలు, ఎన్నికల డీటీ పోతురాజు పాల్గొన్నారు.